
సాక్షి ఒడిశా

శుక్రవారం । 18 । ఆగస్టు । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.5,82,977
బంగారం	5 గ్రాముల 600 మిల్లీ గ్రాములు
వెండి	18 గ్రాముల 600 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



మహనీయులను స్మరించుకోవాలి

రాష్ట్రంలో రెండు రోజుల రాష్ట్ర పర్యటనలో భాగంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పూరీలో పర్యటించారు. - 8లో.



మహిళా పక్షపాతి సీఎం నవీన్

అనేక రంగాల్లో మహిళలను ప్రోత్సహిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్ మహిళా పక్షపాతి అని ఎంపీ చంద్రశేఖర సాహు అన్నారు. పర్లాకిమిడిలో బిజూ మహిళా జనతా దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా పరివర్తన కార్యవర్గ వివరణ సమావేశంలో గురువారం పాల్గొన్నారు. - 8లో.

న్యూస్‌రీల్

బంగాళాఖాతంలో అల్పపీడనం

భువనేశ్వర్: వాయుగుండం ప్రభావంతో వాయవ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడిందని స్థానిక వాతావరణ కేంద్రం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. సముద్ర మట్టం నుంచి 7.6 కి.మీ పరిధిలో వ్యాపించడంతో రాష్ట్రంలో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. వాతావరణ కేంద్రం జారీ చేసిన సమాచారం ప్రకారం గురువారం సాయంత్రం 5.30 గంటల సమయానికి ఖుర్దాలో 78 మిల్లీ మీటర్లు, కెంజొహర్‌లో 67.8 మిల్లీ మీటర్లు, పూరీలో 62.2 మిల్లీ మీటర్లు, భువనేశ్వర్‌లో 56.2 మిల్లీ మీటర్లు, టిట్లాగఢ్‌లో 56.2 మిల్లీ మీటర్లు, నవరంగపూర్‌లో 54 మిల్లీ మీటర్ల వర్షపాతం మరియు బాలాసోర్ వద్ద 41.6 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది.

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఆందోళన



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న బాధితులు

జయపురం: స్థానిక ప్రసాదరావుపేట నాల్గో లైన్‌లో నివాసముంటున్న ముగడ సూర్యనారాయణకు జయపురం తహసీల్, జగన్నాథపూర్ మౌజ, టంకువ గ్రామ పంచాయతీల్లో ఉన్నటువంటి 2 ఎకరాల 30 సెంట్ల భూమిని పేదలు ఇళ్లు కట్టుకునేందుకు ఇదివరకు దానం చేశారు. అయితే ఆ స్థలాలను ఒక వ్యక్తి ఆక్రమించారని, దానిపై చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తూ జయపురం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. సమాజ సేవకుడు బి.హరిరావు నేతృత్వంలో చేపట్టిన ఈ ఆందోళనలో ఇళ్ల స్థలాల దాత ముగడ సూర్యనారాయణ సైతం పాల్గొన్నారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై ఇదివరకే గత నెలలో వినతిపత్రం అందజేసినట్లు గుర్తుచేశారు. అయినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

భారీగా కలప పట్టివేత



స్వాధీనం చేసుకున్న కలపతో అటవీ శాఖ బృందం

మల్కన్‌గిరి: జిల్లాలో బలిమెల ఎన్‌ఏసీలోని ఒక ఇంటిలో భారీగా టేకు ఇతర కలపను అటవీ శాఖ అధికారులు గురువారం పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మహిద్దిన్ షరీఫ్ అనే వ్యక్తి ఇంటిలో భారీగా అక్రమ కలప ఉన్నట్లు అటవీ శాఖ అధికారులకు ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో జిల్లా అటవీ శాఖ అధికారి ప్రతాప్ కొత్తపల్లి ఆదేశాలతో బలిమెల అటవీ రేంజర్ జగన్నాథ్ బిసోయి తన సిబ్బందితో కలిసి షరీఫ్ ఇంటిపై దాడి నిర్వహించారు. అయితే తన కుమార్తెల పెళ్లి కోసం కలపను కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు. కానీ కొనుగోలుకు సబంధించిన రశీదులు లేకపోవడంతో కలపను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందని వెల్లడించారు.

సీబీఐ విచారణకు ఆదేశం



రాష్ట్ర హైకోర్టు

భువనేశ్వర్: జేఈఈ (మెయిన్స్)– 2022 పరీక్షకు హాజరైన అభ్యర్థికి జారీ చేసిన తప్పుడు మార్కుషీట్‌పై సీబీఐ విచారణకు ఒడిశా హైకోర్టు గురువారం ఆదేశించింది. అంశుమాన్ కనుంగో అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం, నాలుగు నెలల్లోగా దర్యాప్తు పూర్తిచేసి నివేదిక సమర్పించాలని సీబీఐకు స్పష్టం చేసింది. నకిలీ మార్కు షీట్ ఆరోపణతో రౌర్కెలా ఎన్ఐటీ అంశుమాన్ కనుంగో అడ్మిషన్ అభ్యర్థనను నిరాకరించిందని వివరించాడు. 98.97 శాతం స్కోర్‌తో ఉత్తీర్ణత సాధించిన తన మార్క్‌షీట్‌లో కొన్ని వ్యత్యాసాలు, దిద్దుబాటు, సవరణలపై అభ్యంతరాలు ప్రస్తావించి సంబంధిత అధికారులకు మెయిల్ పంపాడు. అయితే ఆ తర్వాత పిటిషనర్ మార్కుల స్కోరు 37 శాతానికి దిగజార్చి జాబితా మార్చారని ఆరోపణ. అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసిన మార్కు షీట్ బదలాయించి, ఉత్తరప్రదేశ్‌కు చెందిన మరో విద్యార్థికి అవకాశం కల్పించేందుకు ఈ తప్పిదానికి పాల్పడినట్లు బాధిత విద్యార్థి తరఫున న్యాయవాది ధర్మాసనానికి వివరించారు.

మార్గం సుగమం..!

- కటక్–భువనేశ్వర్ మెట్రో రైలు డీపీఆర్ సిద్ధం
- ఊపందుకుంటున్న పనులు



చీఫ్ సెక్రటరీకి భువనేశ్వర్ మెట్రో రైలు డీపీఆర్ సమర్పిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: కటక్ – భువనేశ్వర్ జంట నగరాల మధ్య మెట్రో రైలు ప్రాజెక్టుకు మార్గం సుగమం అవుతోంది. అంచెలంచెలుగా ఈ పనులు ఊపందుకుంటున్నాయి. ఈ ప్రాజెక్టు చేపట్టేందుకు ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) అనుబంధ సర్వే పనులు నిర్వహించింది. భువనేశ్వర్ మెట్రో రైలు ప్రాజెక్టు కోసం ట్రాఫిక్ సర్వే, జియోటెక్నికల్ ఇన్వెస్టిగేషన్, టోపోగ్రాఫిక్ సర్వే, పర్యావరణ మరియు సామాజిక ప్రభావ అంచనాలతో సమగ్ర పథక నివేదిక (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) సిద్ధం చేసింది. ఈ నివేదికను భువనేశ్వర్ మెట్రో రైల్ కార్పొరేషన్ (బీఎంఆర్ సీ)రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనాకు గురువారం సమర్పించింది.

మెట్రో రైలు పరిధి

మెట్రో రైలు ప్రాజెక్ట్ నివేదిక ప్రకారం తొలి దశలో 26 కిలోమీటర్ల పొడవున నిర్మితమవుతుంది. ఈ పరిధిలో స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం, క్యాపిటల్ హాస్పిటల్, శిశు భవన్, బాపూజీ నగర్, భువనేశ్వర్ రైల్వేస్టేషన్, రామ్ మందిర్ స్క్వేర్, వాణీ విహార్, ఆచార్య విహార్ స్క్వేర్, జయదేవ్ విహార్ స్క్వేర్, జేవియర్ స్క్వేర్, రైల్ సదన్, డిస్ట్రిక్ట్ సెంటర్, డొమొణ స్క్వేర్, పటియా స్క్వేర్, కిట్ స్క్వేర్, నందన్ విహార్, రఘునాథ్‌పూర్, నందన్‌కానన్ జూలాజికల్ పార్క్, ఫులొనాఖొరా మరియు కటక్ త్రిసూలియా ప్రాంతాలను అనుసంధాన పరుస్తారు. ఈ పరిధిలో 20 స్టేషన్లు ఉంటాయని బీఎంఆర్‌సీ పేర్కొంది. ఈ ఏడాది ఉత్కళ దివస్ పురస్కరించుకుని ఏప్రిల్ 1వ తేదీన ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ భువనేశ్వర్ విమానాశ్రయం–త్రిశూలియా (కటక్)ను కలుపుతూ మెట్రో రైలు ప్రాజెక్ట్‌ను మంజూరు చేసినట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. 5టీ కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మలి దశలో మెట్రో రైలు సౌకర్యం మరింత విస్తరిస్తుంది. అంచెలంచెలుగా ఖుర్దారోడ్, పూరీ మరియు భువనేశ్వర్ మరియు కటక్ నగరంలోని ఇతర ప్రాంతాలను అనుసంధానించడం జరుగుతుందని తెలిపారు.

'మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి'



నూతన తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ హమంతి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో రూ.20 లక్షలతో నిర్మించిన తరగతి గదులను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌన్సిల్ చేపట్టే అభివృద్ధి, పారిశుద్ధ్య పనులకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులు గుణాత్మక విద్య అందించాలని సూచించారు. అనంతరం జిల్లా ఉపాధ్యాయ శిక్షణా కేంద్రం(డైట్)లో నూతన క్లాస్ రూమ్‌లను ప్రారంభించారు. అలాగే టౌన్ హాల్ ప్రాంతంలోని ఆహార కేంద్రంలో కొత్తగా నిర్మించిన వంటశాలను ప్రారంభించారు. అదేవిధంగా 17, 19 వార్డుల్లో రెండు ఆహార కేంద్రాలను, మిషన్ శక్తి భవనాలను ప్రారంభించారు. అనంతరం 6వ వార్డు శ్రీరామనగర్ లో కొత్తగా ఏర్పాటు చేసిన పార్కు, పారాబెడలో రూ.23 లక్షలతో నిర్మించిన పార్క్‌ను ప్రారంభించారు. కార్యక్రమాల్లో వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్, డైట్ ప్రిన్సిపాల్ రూపసిందు సొరేన్, బ్లాక్ ఎడ్యుకేషనల్ అధికారి చందన నాయిక్, మున్సిపాలిటీ ఇంజినీర్ విశ్వనాథ్ పాత్రో, జూనియర్ ఇంజినీర్ అజయకుమార్ జాని, పాఠశాల హెచ్‌ఎం సావిత్రీ దేవి పాల్గొన్నారు.

ట్రక్కును ఢీకొన్న అంబులెన్స్



ట్రక్కుని ఢీకొనడంతో దెబ్బతిన్న అంబులెన్స్

- డ్రైవర్‌కు తీవ్రగాయాలు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని మల్కన్‌గిరి – సుకుమ బైపాస్ రోడ్డులో గురువారం మధ్యాహ్నం ఆగివున్న ట్రక్కును సుకుమ నుంచి వస్తున్న అంబులెన్స్ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో అంబులెన్స్ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు డ్రైవర్‌ను చికిత్స కోసం మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే డ్రైవర్ స్పృహలో లేకపోవడంతో వివరాలు ఇంకా తెలియలేదు. మల్కన్‌గిరి పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి ప్రమాద పరిస్థితిని గమనించి కేసు నమోదు చేశారు. అతివేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోందని ఐఐసీ రీగాన్ కీండో తెలియజేశారు.

ఉన్మాదం

- ప్రేమించలేదని అపహరించేందుకు యత్నం
- ఆపై విద్యార్థినిపై దాడి చేసిన యువకుడు

జయపురం: స్థానిక విక్రమదేవ్ స్వయం పాలిత కళాశాలకు చెందిన విద్యార్థినిపై ఒక యువకుడు కత్తితో దాడిచేసి గాయపరిచిన విషయం తెలిసిందే. అయితే విద్యార్థిని తన ప్రేమను ఒప్పుకోనందుకు ఒక యువకుడు అపహరించే ప్రయత్నంలో దాడి చేసినట్లు పోలీసులు గురువారం తెలియజేశారు. వివరాల్లోకి వెళ్తే.. బొయిపరిగుడ సమితికి చెందిన లిప్స పంగి విక్రమ్‌దేవ్ కళాశాలలో +2 చదువుతూ, జయపురం పారాబెడలోని ఒక అద్దె ఇంట్లో తన సోదరుడితో కలిసి నివసిస్తోంది. బుధవారం కాలేజీలో క్లాసులు పూర్తయిన తర్వాత విద్యార్థిని పారాబెడలో ఉన్నటువంటి అద్దె ఇంటికి వెళ్తుండగా, ఆమెను ఇదివరకే ప్రేమిస్తున్నానని వేధిస్తున్న యువకుడు వెనుకనుంచి వెంబడించాడు. పారాబెడలోని కాళ్ల వీధికి వచ్చే సమయానికి ఆమె ముఖాన్ని గుడ్డతో కప్పి అపహరించేందుకు ప్రయత్నించాడు. అయితే విద్యార్థిని గట్టిగా అరవడంతో అతడు తన సహచరులతో కలిసి ఆమె రెండు చేతులను బ్లేడుతో కోసి దాడి చేశాడు. వెంటనే కొంతమంది తోటి విద్యార్థులు గమనించి రావడంతో దుండగులు పారిపోయారు. విద్యార్థులు ఆమెను రక్షించి వెంటనే జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని వారు ఆమె తల్లిదండ్రులకు తెలియజేయగా వెంటనే జయపురం వచ్చి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన ప్రేమను అంగీకరించకపోతే చంపుతానని ఒక యువకుడు బెదిరిస్తున్నట్లు బాధితురాలు పోలీసులకు తెలియజేసింది. దీంతో కేసు నమోదు చేసి సీసీ కెమేరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసు అధికారి సత్యానంద పాత్రో వెల్లడించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని లిప్స పంగి

ఫిబ్రవరి 14 నుంచి ప్లస్–2 వార్షిక పరీక్షలు



భువనేశ్వర్: ఉన్నత మాధ్యమిక విద్యా మండలి (సీహెచ్‌ఎస్ఈ) నిర్వహించే వార్షిక ప్లస్ 2 పరీక్షల షెడ్యూల్ గురువారం విడుదలైంది. 2023–24 విద్యా సంవత్సరం క్యాలెండర్ ప్రకారం 2024 ఫిబ్రవరి 14వ తేదీ నుంచి మార్చి 13వ తేదీ మధ్య ఈ పరీక్షలు నిర్వహిస్తారు. ఫలితాలు ఏప్రిల్ చివరి వారం లేదా మే మొదటి వారంలో వెల్లడిస్తారు.

కీలకమైన తేదీలు

పరీక్షల కోసం ఎక్స్ రెగ్యులర్ విద్యార్థులు ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 15వ తేదీ నుంచి 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. అదేవిధంగా రెగ్యులర్ విద్యార్థులు నవంబర్ 10వ తేదీ నుంచి 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని. వార్షిక హయ్యర్ సెకండరీ పరీక్షల అడ్మిట్ కార్డ్ ఆన్‌లైన్‌లో జారీ అవుతుంది. ఈ ఏడాది డిసెంబర్ 25వ తేదీ నాటికి అడ్మిట్ కార్డు సిద్ధమవుతుంది.

ప్రాక్టికల్ పరీక్షలు

ఈ ఏడాది డిసెంబర్ 22వ తేదీ నాటికి సీహెచ్ఎస్ఈ వెబ్‌సైట్‌లో ప్రాక్టికల్ ఎగ్జామ్స్–24 ఎగ్జామినర్ల జాబితాను అప్‌లోడ్ చేస్తుంది. 2024 జనవరి మొదటి వారంలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ దశ పరీక్షలు ముగిసిన అనంతరం రాత (థియరీ) పరీక్షలు ప్రారంభిస్తారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14వ తేదీ నుంచి మార్చి 13వ తేదీ మధ్య వార్షిక థియరీ పరీక్షలు జరుగుతాయి.

సకాలంలో ఫలితాలు

వార్షిక పరీక్షలు నిర్ధారిత సమయంలో అవకతవకలు లేకుండా నిర్వహించి, అనంతర కార్యాచరణలో పారదర్శకత పరిరక్షణతో సకాలంలో ఫలితాల ప్రచురించేందుకు కార్యాచరణ ఖరారైంది. ప్లస్–2 పరీక్షల ఫలితాలు వచ్చే ఏడాది ఏప్రిల్ చివరి వారం లేదా మే మొదటి వారంలో ప్రచురిస్తారు. వెంటనే ఇన్‌స్టంట్ పరీక్ష నిర్వహణ సన్నాహాలు ఊపందుకుంటాయి. ఈ పరీక్షలు రాసే అభ్యర్థులు వచ్చే ఏడాది మే 3వ వారంలో దరఖాస్తు దాఖలు చేయాల్సి ఉంటుంది. జూన్ 2వ వారంలో ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహిస్తారు.

ఐఏఎస్ అధికారులకు స్థానచలనం

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం ఐఏఎస్ కేడర్‌లో స్వల్ప మార్పులు చేసింది. ఈ నేపథ్యంలో ముగ్గురు అధికారులకు కొత్త పోస్టులు కేటాయించారు. సాధారణ పాలన మరియు ప్రజాభియోగాల విభాగం జారీ చేసిన తాజా నోటిఫికేషన్ ప్రకారం, రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు (బీఎస్ఈ) అధ్యక్షుడు రామశిష్ హజ్రా రాష్ట్ర పశు సంవర్ధక మరియు పశు వైద్య సేవల విభాగం డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఒడిశా రిజిస్ట్రేషన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ జ్యోతి ప్రకాష్ దాస్ రోటీ డైరెక్టర్ మరియు రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు (బీఎస్ఈ) అధ్యక్షునిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్ర పశు సంవర్ధక మరియు పశు వైద్య సేవల డైరెక్టర్ డాక్టర్ ఎద్దుల విజయ్ రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు.

ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ



ఆస్పత్రిలో జనరిక్ మందుల షాపును గోదాముగా మార్చడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీ చంద్రశేఖర సాహు



నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలిస్తున్న ఎంపీ

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని బరంపురం ఎంపీ చంద్రశేఖర సాహు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. బుధవారం నిర్వహించిన జిల్లా పరిషత్ రోగి కల్యాణ సమితి సమావేశంలో ఆస్పత్రిపై అనేక అభియోగాలు రావడంతో ఆస్పత్రిని పరిశీలించారు. ఆర్థోపెడిక్, జనరల్ వార్డులను సందర్శించారు. ఈ సందర్భంగా జనరిక్ ఔషధాల దుకాణం మూసివేసి, గోదాముగా మార్చినట్లు కొందరు ఫిర్యాదు చేయగా సీడీఎంవో డాక్టర్ పి.కె.పాత్రోను పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లోగా మెడిసిన్ గోదామును ఖాళీచేసి ల్యాబ్ టెస్ట్ రూమ్‌గా మార్చాలని ఆదేశించారు. ఈ ఆస్పత్రికి చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీకాకుళం జిల్లాలోని పాతపట్నం, మెళియాపుట్టు, చాపర నుంచి సైతం రోగులు వస్తుంటారు. అయితే సకాలంలో వైద్యులు అందుబాటులో ఉండక రోగులు ఇబ్బందులు పడుతున్నట్లు ఫిర్యాదు వస్తున్నాయి. దీనిపై ఏడీఎంవో(పబ్లిక్ హెల్త్) సమయానికి అందుబాటులో లేనందున సీడీఎంవో డాక్టర్ ప్రదీప్ కుమార్ పాత్రోను సంజాయిషీ అడిగారు. 27 డాక్టరు పోస్టులు ఇటీవలే భర్తీ అయ్యాయని, వారు విధుల్లోకి జాయిన్ అయ్యారని ఆయన ఎంపీకి తెలియజేశారు. ఇక నుంచి సక్రమంగా ప్రజలకు వైద్య సేవలు అందుతాయన్నారు.

పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు

- సాంకేతికతను విద్యార్థులు అందిపుచ్చుకోవాలి
- ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ మనోజ్ కుమార్ పాఢి




విద్యాశాఖ అధికారులతో చర్చిస్తున్న డైరెక్టర్ పాఢి

రాయగడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తోందని స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్‌టీ) డైరెక్టర్ మనోజ్ కుమార్ పాఢి అన్నారు. రాయగడ జిల్లాలో గురువారం ఆయన పర్యటించారు. కొలనార సమితిలోని కేజీబీవీ, ఒడిశా ఆదర్శ విద్యాలయం, ఆశ్రమ పాఠశాల, స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న బోధన, వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ప్రస్తుత యుగంలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. ప్రభుత్వం సాంకేతిక విద్యావిధానానికి నాంది పలికిందని, విద్యార్థులు సక్రమంగా వినియోగించుకుని భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి పూర్ణచంద్ర భొరియా, జిల్లా అదనపు విద్యాశాఖ అధికారి భజన్ లాల్ మాఝిలతో మాట్లాడి విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని ఆదేశించారు. తరుచూ పాఠశాలలను పరిశీలించి ఉపాధ్యాయుల పనితీరు గమనించాలని సూచించారు.

ఉపాధ్యాయుల నియామకంపై దృష్టి

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని మనోజ్ కుమార్ పాఢి వెల్లడించారు. జిల్లాలో ఉపాధ్యాయుల కొరత గతంలో తీవ్రంగా ఉండేదని, ప్రస్తుతం ఆ సమస్యకు తెరపడిందని పేర్కొన్నారు. అయితే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ఈ ఏడాది డిసెంబర్ నాటికి భర్తీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని తెలియజేశారు. జిల్లాలో కొండ ప్రాంతాల్లోని పాఠశాలలకు ఉపాధ్యాయులు సకాలంలో హాజరవ్వడం లేదని ఆరోపణలు ఉన్నాయని, దీనిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా విధానాన్ని మెరుగుపరిచేందుకు యోచిస్తుంటే, అందుకు ఉపాధ్యాయులు సహకరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.



విద్యార్థులతో ముచ్చటిస్తున్న పాఢి

ప్రసవ వేదన



గర్భిణిని మోసుకొని నాగావళి నది దాటుతున్న యువకులు

రాయగడ: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని రహదారి సౌకర్యం లేకపోవడంతో నదిని దాటుతూ మూడు కిలోమీటర్ల మేరకు స్ట్రైచర్ మీదనే మోసుకెళ్లిన ఘటన జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి సికరపాయి పంచాయతీ పరిధి తొలొసాజ్జ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తొలొసజ్జ గ్రామానికి చెందిన జయరాం మినియాక భార్య కవిత నిండు గర్భిణి. ఆమెకు నెలలు నిండడంతో పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అయితే సకాలంలో అంబులెన్స్ చేరినప్పటికీ, గ్రామానికి వెళ్లేందుకు నాగావళి నది దాటాల్సి ఉండడంతో మూడు కిలోమీటర్ల దూరంలో అంబులెన్స్ ఉండిపోవాల్సి వచ్చింది. దీంతో వేరే దారి లేకపోవడంతో గ్రామంలోని యువకులు కవితను స్ట్రైచర్‌పై మోసుకొని అతికష్టం మీద నాగావళి నది దాటించి అంబులెన్స్ వద్దకు చేర్చారు. అనంతరం ఆమెను కల్యాణ సింగుపూర్ పీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు సకాలంలో చికిత్స అందించడంతో పండంటి మగ శిశువుకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లీబిడ్డ పరిస్థితి మెరుగ్గానే ఉందని వైద్యులు చెప్పారు. దీంతో తమ కష్టాలు తీర్చేందుకు ఇప్పటికైనా అధికారులు స్పందించి, గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

మహనీయులను స్మరించుకోవాలి

- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్
- జగన్నాథుని సన్నిధిలో పూజలు


మేరీ మాటి మేరా దేశ్ సైకత శిల్పాన్ని సందర్శించిన మంత్రి


వీరహరేకృష్ణపురంలో జయీ రాజ్‌గురుకు నివాళులర్పిస్తున్న కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్

భువనేశ్వర్: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరికీ ఆచారం కావాలని కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. రెండు రోజుల రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన ఆమె గురువారం పూరీ జిల్లాలో పలు కార్యక్రమాల్లో నిరవధికంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేరీ మాటి మేరా దేశ్ ప్రచార కార్యక్రమం స్వాతంత్ర సమరయోధుడు జయ కృష్ణ (జయీ) రాజ్‌గురు మహాపాత్రో జన్మస్థలం వీరహరేకృష్ణపురం నుంచి ప్రారంభించడం విశేషం. ఈ గ్రామంలో మట్టిని ప్రత్యేకంగా అలంకరించిన అమృత కలశంలో సేకరించి ఊరేగింపు కార్యక్రమంలో మంత్రి ప్రత్యక్షంగా పాలుపంచుకున్నారు. సమరయోధుల విగ్రహాల దగ్గర పుష్పాంజలి ఘటించారు. ఈ ప్రాంతంలోని అమరవీరులు మరియు స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను కూడా సీతారామన్ సత్కరించారు. స్వాతంత్ర్య సమరయోధుల వృద్ధ కుటుంబ సభ్యుల పాదాలు తాకి పెద్దలపై గౌరవాన్ని చాటుకున్నారు. ఆమెతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రో తదితరులు ఉన్నారు.

శ్రీమందిరం సందర్శన

పూరీ పర్యటన పురస్కరించుకుని మంత్రి నిర్మల సీతారామన్ శ్రీమందిరం సందర్శించి జగన్నాథుని సన్నిధిలో పూజలు చేశారు. స్థానిక బ్లూ ఫ్లాగ్ బీచ్‌లో సైకత కళాకారుల బృందం మేరీ మాటి మేరా దేశ్ శీర్షికతో ఏర్పాటు చేసిన సైకత కళాఖండాన్ని ప్రత్యక్షంగా తిలకించి కళాకారులను అభినందించారు. పూరీ పెంట కోట సమీపంలో సెంట్రల్ సంస్కృత విశ్వవిద్యాలయంలోని శ్రీసదాశివ క్యాంపస్‌లో ప్రత్యేకంగా నిర్వహించిన మేరీ మాటి మేరా దేశ్ ప్రచార కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2047 సంవత్సరం నాటికి భారతదేశం వికసిత ఆత్మ నిర్భర శీలిగా ఆవిర్భవించాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణత్యాగాలపై ప్రతి ఒక్కరికీ పూర్తి అవగాహన ఎంతైన అవసరమని పేర్కొన్నారు. అనంతరం కళాక్షేత్రం రఘురాజ్‌పూర్ సందర్శించి స్థానిక పాట్టా చిత్ర నైపుణ్యతని కనులారా తిలకించి పులకించిపోయారు.


రఘురాజపూర్‌లో పాట్టా చౌత్ర కళాఖండం తిలకిస్తున్న దృశ్యం


అమృత కలశ యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

'నగర అభివృద్ధికి సహకరించండి'


సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

బరంపురం: నగర అభివృద్ధికి కార్పొరేటర్లు సహకరించాలని కమిషనర్ సోనాలి జెనా కోరారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో కౌన్సిల్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. బీఎంసీ మేయర్ సంఘమిత్ర దొళాయి అధ్యక్షతలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ సోనాలి జెనా మాట్లాడుతూ బరంపురం నగర అభివృద్ధి కోసం 30 పథకాలు అమలు జరుగుతున్నాయని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ వివేక్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్, వివిధ వార్డులకు చెందిన కార్పొరేటర్లు పాల్గొన్నారు.

యువతిని నమ్మించి మోసం చేసిన వ్యక్తి అరెస్టు


నిందితుడు శంకర్ ఖోర

జయపురం: ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి గురువారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గగణాపూర్ పోలీసుస్టేషన్ పరిధి జేవా పేపరు మిల్లు ప్రాంతం ప్రధానగుడకు చెందిన శంకర్ ఖోర(26) జయపురం సమితిలోని ఒక ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. అదే ఫ్యాక్టరీలో పని చేస్తున్న ఒక యువతితో రెండేళ్ల క్రితం శంకర్‌కు పరిచయం ఏర్పడింది. అలా వారి పరిచయం ప్రేమగా మారింది. దీంతో పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని లోబరుచుకున్నాడు. అనంతరం పెళ్లి చేసుకుందామని యువతి ఒత్తిడి తీసుకొని రాగా, పెళ్లి పేరెత్తితే చంపేస్తానని బెదిరించాడు. దీంతో యువతి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అనంతరం దర్యాప్తు నిర్వహించి మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలియజేశారు.

కళింగ శివంగి


వీరగున్నమ్మ సైకత శిల్పం

ఆమదాలవలస రూరల్: కళింగ శివంగి వీరగున్నమ్మకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు సైకత శిల్పి గేదెల హరికృష్ణ సైకత శిల్పాన్ని తీర్చిదిద్దాడు. గాజులకొల్లివలస గ్రామం సమీపంలో సంగమేశ్వర ఆలయం వద్ద గురువారం వేసిన సైకత శిల్పం ఆకట్టుకుంది.

ఆదిత్యుని కానుకల్లో ఆభరణాల లెక్కింపు నేడు

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి ఆలయ హుండీల్లో కానుకలుగా లభించిన బంగారు, వెండి ఆభరణాలు, వస్తువులను గోల్డ్ బాండ్ స్కీంలో భద్రపరిచే ప్రక్రియ శుక్రవారం ఉదయం చేపడుతున్నట్లు ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలియజేసారు. ఈ మేరకు దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్, జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారులు, ఆలయ పాలకమండలి సమక్షంలో ఈ ప్రక్రియ కట్టుదిట్టమైన భద్రతాచర్యల నడుమ నిర్వహిస్తున్నట్లుగా ఆయన ప్రకటించారు. స్వామి వారి మూలవిరాట్టుకు నిత్యాలంకరణతో పాటు పర్వదినాల్లో వినియోగించే ఆభరణాలు మినహాయించి, కానుకల రూపంలో లభించిన బంగారు, వెండి వస్తువులన్నింటిని లెక్కించి గోల్డ్ బాండ్ స్కీంలో పెట్టనున్నారని ప్రకటించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



కవిటి: మండలంలోని రాజపురం పంచాయతీ కమలాయిపుట్టుగకు చెందిన శీరపు దేవేంద్ర(33) బుధవారం రాత్రి ఇంటిలో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి కవిటి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు దేవేంద్రకు తన భార్య లలితకు గత కొన్నాళ్లుగా అంతర్గత గొడవలు ఉన్నాయి. వారికి ఐదేళ్ల పాప తన్వి కూడా ఉంది. ఈ కలహాల వల్లే దేవేంద్ర ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి శీరపు నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కవిటి ఎస్‌ఐ కె.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కలెక్టర్ సుడిగాలి పర్యటన


బస్టాండ్ నిర్మాణానికి సంబంధించిన మ్యాప్ పరిశీలిస్తున్న ప్రధాన్

రాయగడ: జిల్లా అదనపు కలెక్టర్ రామేశ్వర్ ప్రధాన్ గురువారం రామనగుడ, పద్మపూర్, గుణుపూర్ సమితుల్లో సుడిగాలి పర్యటన చేశారు. ఆయా ప్రాంతాల్లోని తహసీల్దార్లతో సమావేశమై రెవెన్యూ వసూళ్లలో సమయానుకూలత పాటించాలని సూచించారు. సకాలంలో వసూళ్లు చేసి నిర్ధారిత లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా భూలావాదేవీలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను సత్వరంగా పరిష్కరించాలన్నారు. రామనగుడలో కొత్త బస్టాండ్ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పద్మపూర్ తహసీల్ పరిధిలోని జగముండ ప్రాథమిక పాఠశాల నిర్మాణానికి గుర్తించిన స్థలాన్ని పరిశీలించారు. ఆయనతో పాటు రామనగుడ తహసీల్దార్ నిర్మాల్ నాయక్, పద్మపూర్ తహసీల్దార్ గీతాంజలి బెహర, గుణుపూర్ తహసీల్దార్ శరత్ నాయక్ తదితరులు ఉన్నారు.

కరాటే పోటీల్లో పతకాల పంట

బరంపురం: రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో జరిగిన అంతరాష్ట్ర కరాటే పోటీల్లో బరంపురం క్రీడాకారులు పతకాల పంట పండించారు. మొత్తం 4 సిల్వర్, 3 బ్రాంజ్ మెడల్స్ సాధించారు. రెండు రోజులుగా జరుగుతున్న పోటీల్లో స్థానిక లంజిపల్లిలోని కళింగా ఫైట్ స్కూల్‌కి చెందిన ఏడుగురు క్రీడాకారులు సత్తా చాటారు. దినేష్ పాత్రో, బాలజీ ప్రసాద్ పాఢి, కె.సుబంరౌత్, ఆయుస్మాన్ దొళాయి, శేఖర్ చౌదరిలు బంగారు, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ దక్కించుకున్నట్లు శిక్షకుడు సత్యనారాయణ పాత్రో తెలియజేశారు. క్రీడాకారులకు పలువురు అభినందనలు తెలియజేశారు.


పతకాలతో క్రీడాకారులు

యువతి ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం యామలపేట గ్రామానికి చెందిన అమీర బాను అనే యువతి గురువారం సూపర్ వాస్మాల్-33 తాగి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది. ఇంటిలో కలహాల కారణంగా ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లడంతో వైద్యుడు మహారాజ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు.

ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి రూ.10 లక్షలు కేటాయింపు


ఎంపీకి వివరాలు తెలియజేస్తున్న విలేకరులు

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌ను ఎంపీ చంద్రశేఖర సాహు గురువారం ఉదయం సందర్శించారు. ప్రస్తుత ప్రెస్‌క్లబ్‌ను టౌను హాలు ఆవరణలో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. దీంతో ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి ఎంపీ చంద్రశేఖర సాహు ఎంపీ లాండ్స్ నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయించారు. అలాగే పర్లాకిమిడి ఎమ్మెల్యే కె.నారాయణరావుకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు బుధవారం కలిసి వినతిపత్రం అందజేయగా, ఎమ్మెల్యే లాండ్స్ నిధుల నుంచి రూ.5 లక్షలు కేటాయించారు. దీంతో ప్రెస్‌క్లబ్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

కెనడా మైండ్ మీడియా రేడియోకు తిరుమలరావు కవిత

కొత్తూరు: కెనడాలోని తెలుగు సంఘం మైండ్ మీడియా రేడియోలో ప్రసారానికి అంతర్జాతీయస్థాయిలో తెలుగు కవితలను ఆహ్వానించింది. ఈ ప్రసారాలకు కొత్తూరు మండలం కడుము జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కుదుము తిరుమల రావు రచించిన మనజాతి అజెండా-మన జాతీయజెండా అనే కవితను ఎంపికైంది. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన తిరుమలరావును పలువురు అభినందించారు.

మహిళా పక్షపాతి సీఎం నవీన్


సమావేశంలో పాల్గొన్న బీజేడీ నాయకులు

- ఎంపీ చంద్రశేఖర సాహు

పర్లాకిమిడి: అనేక రంగాల్లో మహిళలను ప్రోత్సహిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్ మహిళా పక్షపాతి అని ఎంపీ చంద్రశేఖర సాహు అన్నారు. స్థానిక బిజూ కల్యాణ మండపంలో బిజూ మహిళా జనతా దళ్ ఆధ్వర్యంలో జిల్లా పరివర్తన కార్యవర్గ వివరణ సమావేశాన్ని అస్కా ఎంపీ ప్రమీళ బిశోయి, బరంపురం ఎంపీ చంద్రశేఖర సాహు, బీజేడీ మహిళా కార్యదర్శి కస్తూరీ మహాపాత్రోలు గురువారం ప్రారంభించారు. మిషన్ శక్తి ద్వారా మహిళలు స్వయం సహాయక గ్రూపుల సాయంతో ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారని కస్తూరీ మహాపాత్రో అన్నారు. జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులు సీఎం నవీన్ పట్నాయిక్ ప్రవేశపెట్టిన పథకాలతో సంతోషంగా ఉన్నారని జిల్లా మహిళా అధ్యక్షురాలు పూర్ణబాసి నాయక్ అన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మహిళా గ్రూపులు, నేత్రిమణులు ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేయాలని ఎంపీ ప్రమీళా బిశోయి కోరారు. సమావేశంలో కాశీనగర్ సమితి చైర్‌పర్సన్ బల్ల శాయమ్మ, కాశీనగర్ ఎన్ఏసీ చైర్మన్ మేడిబోయిన సుధారాణి, పట్టణ బిజూ మహిళా అధ్యక్షురాలు సంజుక్తా బెహరా, జిల్లా బీజేడీ అధ్యక్షులు జగబంధు దాస్, తిరుపతి పాణిగ్రాహి, రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్ నాయక్, బసంత్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి' ఫొటోగ్రాఫర్‌కు నేషనల్ అవార్డు


అవార్డు వచ్చిన ఫొటో (ఇన్‌సెట్లో) కుప్పిలి జయశంకర్



శ్రీకాకుళం క్రైమ్: ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ఫొటో కాంటెస్ట్-2023 సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్ కుప్పిలి జయశంకర్ అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపికైనట్లు ఏపీపీజేఏ నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డును ఫొటోగ్రఫీ-డే సందర్భంగా ఈ నెల 19న విజయవాడలో అందజేయనున్నారు.

అత్యుత్తమ పనితీరు.. అత్యున్నత గుర్తింపు

- శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ న్యూఢిల్లీ గుర్తింపు
- రాష్ట్రంలోనే ఉత్తమ పాలిటెక్నిక్ కళాశాలగా కీర్తి


ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ గుర్తింపు పొందిన నేపథ్యంలో అధికారులను అభినందిస్తున్న సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి

ఎచ్చెర్ల క్యాంపస్:

శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ అత్యున్నత గుర్తింపు దక్కించుకుంది. ఎందరో ఉత్తమ మానవ వనరులను తీర్చిదిద్దిన ఈ సంస్థకు అరుదైన గుర్తింపు లభించింది. తాజాగా ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ న్యూఢిల్లీ గుర్తింపు లభించింది. రాష్ట్రంలోనే ఈ గుర్తింపు సాధించిన కళాశాలగా కీర్తి పొందింది. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏటా 300 సీట్లకు ప్రవేశాలు జరుగుతున్నాయి. సివిల్, కంప్యూటర్, మెకానికల్, ట్రిపుల్‌ఈ, సీసీపీ బ్రాంచ్‌లు ఉన్నాయి. ఉత్తీర్ణత సాధించి, రిలీవ్ అయిన విద్యార్థులకు 20 శాతం ప్లేస్‌మెంట్‌లు లభిస్తున్నాయి. 70 శాతం మంది విద్యార్థులు ఇంజినీరింగ్, ఇతర ఉన్నత విద్యలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. సాంకేతిక విద్యాశాఖ డిజైన్ చేసిన కరిక్యులమ్ పక్కాగా అమలు చేస్తోంది. ఏటా చివరి సెమిస్టర్ రిలీవ్ నాటికి 80 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తున్నారు. మౌలిక వసతులు, ల్యాబ్‌లు, శిక్షణ ఉత్పత్తి కేంద్రం నిర్వహణ వంటివి పక్కాగా నిర్వహిస్తున్నారు. కళాశాలలకు అవసరమైన ఫర్నీచర్ సైతం తామే సొంతంగా ఈ కళాశాలలో తయారు చేసుకుంటారు. ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ వంటివి ఆదర్శంగా అమలు చేస్తున్నారు. ఎస్‌సీసీ, స్పోర్ట్స్ రిజర్వేషన్ సైతం విద్యార్థులకు ఉపయోగపడుతుంది. విద్యలో పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు వంటి వాటికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎన్‌బీఏ, పీసీటీఏ వంటి సంస్థల గుర్తింపులు ఉన్నాయి.


ఎన్‌సీసీ పరేడ్ చేస్తున్న విద్యార్థులు


శిక్షణ, ఉత్పత్తి కేంద్రం నిర్వహణలో విద్యార్థులు


పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా శిక్షణ



కళాశాలలో చేరిన నుంచి పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యను అందిస్తున్నారు. ప్రత్యేక శిక్షణ సైతం ఇస్తున్నారు. క్లాస్‌వర్క్ పక్కాగా జరుగుతోంది. హైదరాబాద్‌కు చెందిన సాట్రోటిక్స్ కంపెనీలో రూ. 2.4 లక్షల ప్యాకేజీతో జూనియర్ ట్రైనీ ఇంజినీర్‌గా ఎంపికయ్యాను. భవిష్యత్‌లో నైపుణ్యాలు పెంచుకుంటే మంచి భవిష్యత్ ఉంటుంది.

– ఎస్.ఉదయ్‌కిరణ్, కంప్యూటర్ ఇంజినీరింగ్ విద్యార్థి

రాష్ట్రంలో గుర్తింపు



రాష్ట్రంలో ఉత్తమ పాలిటెక్నిక్‌గా గుర్తింపు రావటం ఆనందంగా ఉంది. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ గుర్తింపు విద్యా బలోపేతానికి దోహద పడుతుంది. ఇది సమష్టి కృషి. సాంకేతిక విద్యాశాఖ లక్ష్యాలు, మార్పులకు అనుగుణంగా డిప్లమా కోర్సులు నిర్వహిస్తున్నాం. విద్యార్థుల భవిష్యత్ లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఇంకా ప్రత్యేక దృష్టి పెట్టి శత శాతం ఉత్తమ పాలిటెక్నిక్ కాలేజీగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తాం.

– గురుగుబెల్లి దామోదర్‌రావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్

పక్కాగా కరిక్యులమ్ నిర్వహణ



సాంకేతిక విద్యాశాఖ ప్రతి విద్యార్థికి ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంగా కరిక్యులమ్ డిజైన్ చేస్తోంది. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా మొదటి సెమిస్టర్ నుంచి విద్య కొనసాగుతుంది. చాలా మంది విద్యార్థులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్యాంపస్ డ్రైవ్‌ల్లో ఎన్నికవుతున్నారు. ఎక్కువ మంది విద్యార్థులు డిప్లమా తర్వాత ఇంజినీరింగ్ విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారు. కొందరు మాత్రం ఉద్యోగాల్లో చేరుతున్నారు.

– మురళీకృష్ణ, సీనియర్ అధ్యాపకులు

ఐటీ కేసులపై దృష్టి పెట్టాలి: ఎస్పీ


సీసీ కమాండ్ కంట్రోల్ రూం పనితీరును పరిశీలిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : ఐటీ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి దర్యాప్తు చేయాలని ఎస్పీ జీఆర్ రాధిక రెండో పట్టణ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావుకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం నగరంలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ క్రమంలో ముందుగా పోలీస్ స్టేషన్ పైభాగంలో ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్ సందర్శించి సీసీ కెమెరాలు ఎలా పనిచేస్తున్నాయన్న దానిపై, స్టేషన్‌లో ఉన్న ఈ మాల్ ఖానాలో ఉన్న ప్రాపర్టీ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

దర్యాప్తులో ఉన్న ముఖ్యమైన కేసుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి గ్రేవ్, ఐటీ తదితర కేసుల దర్యాప్తు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. సైబర్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బ్యాంకు అధికారులతో చర్చించి బాధితులకు న్యాయం జరిగేటట్లు చూడాలని, రాత్రి వేళల్లో బీట్ల సంఖ్య పెంచి తరచూ నేరాలు జరిగే చోట పాత నేరస్తులపై ప్రత్యే నిఘా పెట్టాలన్నారు. అవసరమైన చోట సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నేరాలను కట్టడి చేయాలని, ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. ముఖ్యమైన కేసుల రికార్డులు, పోలీస్ స్టేషన్ రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. తనిఖీల్లో డీఎస్పీ వై.శృతి, సీసీ శివకుమార్, ఎస్‌ఐ కె.లక్ష్మి ఉన్నారు.

'ఒత్తిడి లేని విద్య అందిస్తాం'

ఎచ్చెర్ల క్యాంపస్: ఒత్తిడి లేని సాంకేతిక విద్య విద్యార్థులకు అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) రాష్ట్ర చాన్స్‌లర్ కేసీ రెడ్డి అన్నా రు. ఎస్ఎంపురంలోని శ్రీకాకుళం క్యాంపస్‌లో గురువారం పీయూసీ మొదటి సంవత్సరం (ప్రీ యూని వర్సిటీ కోర్సు)లో ప్రవేశాలు పొందిన విద్యార్థులను ఉద్దేశించి గురువారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ సాంకేతిక నిపుణులను తయారు చేసే లక్ష్యంతో ఈ ట్రిపుల్ ఐటీలు ఏర్పడ్డాయని అన్నారు. రెండేళ్ల పీయూసీ, నాలుగేళ్ల ఇంజినీరింగ్ తర్వాత ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో అత్యున్నత స్థానాల్లో విద్యార్థులు ఉంటార ని అన్నారు. పాఠశాల విద్యకు, పీయూసీ, ఇంజినీరింగ్ విద్యకు తేడా ఉంటుందని తెలిపారు. ప్రతి విషయా న్ని నేర్చుకోవాలని అన్నారు. పీయూసీలో ఇంటర్మీ డియట్‌తో పోల్చితే ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి సబ్జెక్టులు ఉంటాయని అన్నారు. విద్యార్థులు సబ్జెక్టుపైన, ఇంగ్లిష్‌పై దృష్టి పెట్టాలని చెప్పారు. ప్రమాణాలతో కూడిన విద్య అందిస్తామన్నారు. వసతి గృహం, మెస్ విద్యార్థుల కు అనుగుణంగా నిర్వహిస్తామని, విద్యార్థులు కోరు కుంటే మెనూ కూడా మారుస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మంచి ప్రతిభ ఉందని, అందుకు తగ్గ సాధన అవసరమని తెలిపారు. విద్యార్థులను ఉత్త మ మానవ వనరులుగా తీర్చిదిద్దే లక్ష్యంగా విద్యా విధానం కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు, ఓఎస్ డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

20న అండర్-13 చెస్ క్రీడాకారుల ఎంపిక

● జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కేవీ జ్వాలాముఖి

విజయనగరం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న అండర్-13 బాల, బాలికల విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేవీ జ్వాలాముఖి గురువారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి విజయనగరం జిల్లా కేంద్రంలోని రింగ్‌రోడ్‌లో గల ఫైర్ చెస్ స్కూల్‌లో నిర్వహించే ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు 2010 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించిన క్రీడాకారులు అర్హులని పేర్కొన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు విధిగా జనన ధ్రువీకరణ పత్రం వెంట తీసుకురావాలని సూచించారు. ఆ రోజు జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులను అక్టోబర్ 27,28,29,30 తేదీల్లో విజయనగరం వేదికగా జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని, పేర్ల నమోదు కోసం ఫోన్ 97033 44488 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు స్వామినాయుడు


జాతీయ స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన స్వామినాయుడు, కోచ్ గణేష్

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న స్విమ్మింగ్ పోటీలకు విజయనగరం జిల్లాకు చెందిన బి.స్వామినాయుడు అర్హత సాధించాడు. ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు ఒడిశా రాజధాని భువనేశ్వర్ వేదికగా జరగనున్న 39వ సబ్ జూనియర్, 49వ జూనియర్స్ జాతీయ స్థాయి స్విమ్మింగ్స్ పోటీలకు రాష్ట్ర జట్టు తరఫున స్వామినాయుడు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించిన స్వామినాయుడు, కోచ్ బి.గణేష్‌లను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావులు అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభా పాటవాలు కనబరిచి విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

యువకుడి ఆత్మహత్య

పార్వతీపురం/కొమరాడ: ఇంటిలో ఏర్పడిన స్వల్ప ఘర్షణతో క్షణికావేశంలో పురుగు మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్ట్ పోలీసులు గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం నుంచి వచ్చి కొమరాడ మండలం దళాయిపేటలో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్న ఎస్.వెంకటి (35) దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. గురువారం భార్యాభర్తల మధ్య జరిగిన స్వల్ప ఘర్షణతో వెంకటి మనస్తాపం చెంది పురుగు మందు తాగేశాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు 108 వాహనం ద్వారా జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

19 మద్యం సీసాలతో ఒకరి అరెస్టు


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎస్ఈబీ సిబ్బంది

బొబ్బిలి: ఎస్ఈబీ బొబ్బిలి సర్కిల్ పరిధి తెర్లాం మండలం పెరుమాళికి చెందిన కొరగంజి సత్యనారాయణ మద్యం సీసాలు విక్రయిస్తుండగా పట్టుకున్నామని సీఐ ఆర్.జైభీమ్ విలేకరులకు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ నిందితుడు గ్రామంలో మద్యం విక్రయిస్తుండగా పట్టుకుని 19 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

20 అడుగుల గిరినాగు హతం



వేపాడ: మండలంలోని కొండగుళ్ల-గుడివాడ గ్రామాల మధ్యలో వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు కళ్లాల సమీపంలో గురువారం కనిపించిన 20 అడుగుల పొడవున్న గిరినాగును చూసి స్థానికులు భయపడ్డారు. కొందరు యువకులు వెంటనే తేరుకుని గిరినాగు, దాని పిల్లను హతమార్చారు.

ఈ క్రాప్ ఉండగా.. భయమెందుకు దండగ..!

● జిల్లాలో ప్రారంభమైన ఖరీఫ్ పంటల నమోదు
● సమగ్ర నమోదుకు జియో ఫెన్సింగ్ సిస్టమ్
● అన్నదాతలకు బహుళ ప్రయోజనాలు


పాలకొండ మండలంలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న సిబ్బంది


ఈ క్రాప్ నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తు వ్యవసాయ శాఖ అధికారులు

పాలకొండ రూరల్/పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 2,29,705 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 1,34,719 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఈ క్రాప్‌లో నమోదు చేసే విధంగా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటోంది. గతేడాది పంటల నమోదులో తలెత్తిన లోపాలను అధిగమించేందుకు తాజాగా జియోఫెన్సింగ్ సిస్టమ్‌తో ఎంపిక చేసుకున్న సర్వే నంబర్లలో ఫొటో తీయాల్సి ఉంది. నూతన విధానంలో ఈ క్రాప్‌లో ఎటువంటి సవరణ ఆప్షన్ లేదు. దీంతో పంటల నమోదులో అన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వెబ్‌ల్యాండ్ డేటా లింక్ (ఎస్ఎస్ఐసీ) సహకారంతో యాప్‌ను వ్యవసాయ శాఖ రూపొందించింది.

లక్ష్యాలను పూర్తిచేసేందుకు..

నిర్ణీత గడువులోగా పంటల నమోదు లక్ష్యాలను పూర్తి చేసే విధంగా వ్యవసాయ శాఖ కార్యాచరణ రూపొందించింది. సెప్టెంబర్ 15 నుంచి 30 వరకు ఈ క్రాప్‌లో నమోదు చేసిన వివరాల మేరకు రైతుల ఈ కేవైసీ తీసుకోనున్నారు. ఏడీఏ, జేడీఏ, జేసీ, కలెక్టర్ తదితర ఉన్నతాధికారులు సూపర్ చెక్ చేసిన తర్వాత సోషల్ ఆడిట్ నిర్వహిస్తారు. అటుపై రైతులకు డిజిటల్, మాన్యువల్ రసీదులు ఇవ్వాల్సి ఉంది. పంటను సులభంగా గుర్తించడానికి తగినంత ఎత్తు ఉందా లేదా గుర్తించి ఫొటో తీసే విధంగా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. ఆహార పంటలను ధాన్యాలుగా మార్పు చేశారు. చిరుధాన్యాల్లో జొన్న, సజ్జ, రాగి తదితర పంటలను చేర్చారు. రక్షిత సాగు (షేడ్ నెట్/పాలిహౌస్‌లో సాగు) పంటలను కూడా ఈ-క్రాప్ లో నమోదు చేస్తారు. వరి పంటకాలం నారుమడి నుంచి పంట కోత వరకు ఉంటుంది. నాట్లు వేసిన రోజు నుంచి 25-30 రోజుల ముందు విత్తనం వేసినట్లుగా(డేట్ ఆఫ్ సోయింగ్) ఉండాలి.

రెండు శాఖల పర్యవేక్షణ

ఈ ఏడాది పంటల నమోదును వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పర్యవేక్షించనున్నాయి. గ్రామస్థాయిలో ఆర్‌బీకే ఇన్‌చార్జ్ పంటలను నమోదు చేస్తారు. ఈ డేటాను వీఆర్వోలు ధ్రువీకరించాల్సి ఉంది. తర్వాత మండల వ్యవసాయ అధికారి లాగిన్‌కు, అక్కడి నుంచి తహసీల్దార్ లాగిన్‌కు వివరాలు వెళ్తాయి. వెబ్‌ల్యాండ్ డేటాను ప్రామాణికంగా తీసుకోవడం వల్ల పొరపాట్లకు తావు లేకుండా ఉంటుంది. వెబ్‌ల్యాండ్‌లో ప్రతి సర్వే నంబర్‌కు రైతు ఆధార్, మొబైల్ నంబర్ అనుసంధానమై ఉంటుంది. ఈ-కర్షక్ యాప్‌కు ఆర్‌బీకేలు, రెవెన్యూ గ్రామాలను మ్యాపింగ్ ఇప్పటికే చేయడంతో యాప్‌లో రైతు ఆధార్ నంబర్ నమోదు చేస్తే భూమి వివరాలు దర్శనమిస్తాయి. ఈ క్రాప్‌లో భాగంగా సాగు వివరాలు నమోదు చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో పంట ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు.

శతశాతం పారదర్శకత

పంటల నమోదులో వందశాతం పారదర్శకత ఉండేందుకు ఈ దఫా జియో ఫెన్సింగ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. పంట పొలాల్లో తీసిన ఫొటోలను అక్షాంశం, రేఖాంశం ద్వారా విశ్లేషిస్తారు. జియో ఫెన్సింగ్‌తో చేసిన ఈ క్రాప్ బుకింగ్ ఏ విధంగా ఉంటుందనే దానిపై ఇప్పటికే అవగాహన కల్పించారు. పంటల నమోదు, ఫొటోలు అప్లోడ్ చేయడంలో తేడాలు ఉంటే వ్యవసాయశాఖ సిబ్బందిపై చర్యలు తీసుకుంటారు. క్షేత్రస్థాయిలో నమోదు చేయనున్న వివరాలను సిబ్బంది పూర్తిగా పరిశీలించిన తర్వాతనే అప్‌లోడ్ చేయాల్సి ఉంది.

ఈ క్రాప్ నమోదుతో ప్రయోజనాలు ఇలా..

● ఈ క్రాప్ నమోదు ఆధారంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకుల ద్వారా పంట రుణాలు
● వైఎస్ఆర్ సున్నా వడ్డీకి అర్హత రూపాయి కూడా ప్రీమియం చెల్లించకుండా ఉచిత పంటల బీమా
● ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంటనష్టం జరిగినపుడు పెట్టుబడి పరిహారం
● ధరలు పడిపోయినపుడు కనీస మద్దతు ధరతో రైతుభరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం

విస్తృతంగా అవగాహన



పంటల నమోదుతో కలిగే ప్రయోజనాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ఈ ఏడాది పంటల నమోదు మరింత పకడ్బందీగా చేపడుతున్నాం. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పంటలను ఈ కర్షక్ యాప్‌లో నమోదు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే 15 మండలాల్లో 1194.32 ఎకరాల్లో నమోదు చేపట్టాం. నిర్దేశిత సమయంలో శతశాతం నమోదు పూర్తి చేస్తాం. వచ్చే నెల 19 నుంచి 24 వరకు ఆర్‌బీకేల్లో జాబితాలను ప్రదర్శిస్తాం. 25 నుంచి 28 వరకు అభ్యంతరాలు పరిష్కరిస్తాం. సెప్టెంబర్ 30 నాటికి సోషల్ ఆడిట్, సూపర్‌చెక్, ఈ కేవైసీ నిర్వహించి తుది జాబితా సిద్ధం చేస్తాం.

కె.రాబర్ట్‌పాల్,
జిల్లా వ్యవసాయాధికారి, పార్వతీపురం మన్యం

వినియోగదారుల హక్కుల పట్ల అవగాహన

● జేసీ ఆర్.గోవిందరావు


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు

పార్వతీపురంటౌన్: వినియోగదారుల రక్షణ చట్టం, 2019 పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, అందుకు గాను వారికి ఈ చట్టం గురించి తెలియజేయాలని జాయింట్‌కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక ఐటీడీఏ సామాజిక భవనంలో వినియోగదారుల క్లబ్ ఇన్‌చార్జ్‌లుగా నియమితులైన 189 మంది ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్‌లకు జిల్లాస్థాయి ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం, 2019 పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో 8వ, 9వ తరగతి విద్యార్థుల కోసం ఒక వినియోగదారు క్లబ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుల హక్కులను అట్టడుగు స్థాయికి తీసుకెళ్లేందుకు వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం - పౌరసరఫరాల శాఖ విస్తృతమైన ప్రచారాన్ని ప్రారంభిస్తోందని చెప్పారు. విద్యార్థి సంఘం భాగస్వామ్యం లేకుండా, వినియోగదారుల హక్కులను సమాజానికి తెలియజేయలేమని, అందుకుగాను విద్యార్థులను ఇందులో భాగస్వాములను చేసేందుకు వినియోగదారుల క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో 8, 9వ తరగతి విద్యార్థుల కోసం ఒక వినియోగదారు క్లబ్‌ను ప్రారంభించి అవగాహన కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళిక అందజేశామని, విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించడం, వినియోగదారులకు సంబంధించిన విషయాలపై సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించడం, వ్యాసరచన పోటీలు, డ్రాయింగ్ పోటీలు, వినియోగదారుల సవాళ్లపై సర్వే వంటి కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

ఇన్‌చార్జ్‌లకు చట్టంపై అవగాహన

జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ అన్ని ఉన్నత పాఠశాలల్లో 8-9వ తరగతి విద్యార్థుల కోసం ఒక వినియోగదారుల క్లబ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుల క్లబ్‌లకు ఇన్‌చార్జిలుగా నియమించిన 189 మంది ఉపాధ్యాయులకు ఈ చట్టం పట్ల అవగాహన కల్పించేందుకు జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేశామన్నారు. వినియోగదారుల క్లబ్ ఇన్‌చార్జ్‌గా నియమితుడైన ఉపాధ్యాయుడు కార్యాచరణను అమలుచేసి ఈ చట్టం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు.

ఐటీ, టూరిజం, హాస్పిటాలిటీలో ఉచిత శిక్షణ

● 23 వరకు అభ్యర్థుల ఎంపిక

పార్వతీపురంటౌన్: ఐటీ/టూరిజం అండ్ హాస్పిటాలిటీ/రంగాల్లో శిక్షణ కోసం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యూత్ ట్రైనింగ్ సెంటర్ సీతంపేట కేంద్రంలో ఈ నెల 23వ తేదీ వరకు అభ్యర్థుల ఎంపిక నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఉరిటి సాయికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు డీడీయూజీకేవై, సీడాప్, ఏపీఎస్ఎస్ డీసీ ఆధ్వర్యంలో నాలుగు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు ఉచిత వసతి, భోజనంతో పాటు మెటీరియల్స్ అందజేస్తామని, తరగతులు పూర్తయ్యాక ఉపాధి కల్పిస్తామని స్పష్టం చేశారు. మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, సివిల్, ఆటోమోటివ్ అండ్ ఏరోస్పేస్‌లో బి.టెక్/డిప్లమో విభాగాల్లో 2020, 2021, 2022 సంవత్సరాల్లో ఉత్తీర్ణత సాధించి, 18 నుంచి 23 ఏళ్ల వయసు గల యువకులు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సంబంధిత విద్యార్హత పత్రాలతో యూత్ ట్రైనింగ్ సెంటర్ సీతంపేట కేంద్రానికి ఈ నెల 23వ తేదీలోగా హాజరు కావాలని కోరారు. పార్వతీపురం మన్యం జిల్లా స్కిల్ కాలేజ్‌లో శిక్షణ ఉంటుందని తెలియజేశారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ 7032060773నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

షాపు తొలగించనందుకు కొట్లాట


చికిత్స పొందుతున్న సత్యనారాయణ

పార్వతీపురం: ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన కార్పెంటర్ షాపు తొలగించనందుకు గొడవ జరిగి ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన కార్పెంటర్ ఎస్.సత్యనారాయణ తన ఇంటి సమీపంలోని ప్రభుత్వ స్థలంలో గ్రామ పెద్దల అనుమతితో ఐదేళ్ల క్రితం కార్పెంటర్ షాపు ఏర్పాటు చేశాడు. అయితే షాపు ఉన్న వీధిలో సీసీ కాలువలను ఏర్పాటు చేయాలని గ్రామ పెద్ద డి.ధనుంజయనాయుడు కార్పెంటర్ సత్యనారాయణకు తెలియజేశాడు. ఈనెల 16న స్థలాన్ని ఖాళీ చేయాలని నోటీసులు కూడా అందజేశారు. ఈ క్రమంలో గురువారం డ్రైనేజీలు తవ్వేందుకు జేసీబీని తీసుకుని వస్తుండగా సత్యనారాయణ కోర్టు ఆర్డర్‌ను చూపించేందుకు ప్రయత్నించగా ధనుంజయనాయుడు వచ్చి షాపును తొలగిస్తావా లేదా అని వాగ్వాదానికి దిగి కొట్టాడు. ఈ సంఘటనలో సత్యనారాయణకు పలు చోట్ల గాయాలు కావడంతో చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి 108 అంబులెన్స్ ద్వారా తరలించారు.

వృత్తి ధర్మం పాటిద్దాం


సర్గీయ చింతామణి విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

● 'సేవ్ జర్నలిజం' సదస్సులో జర్నలిస్టులు



సదస్సులో మాట్లాడుతున్న ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అల్లు సూరిబాబు

విజయనగరం అర్బన్: వృత్తి ధర్మాన్ని పాటిస్తూ పవిత్రమైన జర్నలిజం విలువలను పరిరక్షించుకోవాలని పలువురు సీనియర్ జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. ఏపీయూడబ్ల్యూజే 66వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో 'సేవ్ జర్నలిజం' అంశంపై గురువారం నిర్వహించిన సదస్సులో ఈ మేరకు పేర్కొన్నారు. తొలుత క్లబ్ ఆవరణలో ఉన్న సర్గీయ సీవై చింతామణి విగ్రహానికి పలువురు జర్నలిస్టులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఇటీవల ఎన్నికైన ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ, ఎలక్ట్రానిక్ మీడియా సంఘం, చిన్న పత్రికల సంఘం నూతన కార్యవర్గాలు బాధ్యతలను స్వీకరించాయి. సంఘం వార్షిక ప్రణాళిక రూపకల్పనపై సీనియర్ జర్నలిస్టులు ఇచ్చిన సూచనలు, సలహాలను నూతన కమిటీ స్వీకరించింది. అనంతరం ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అల్లు సూరిబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో పలువురు మాట్లాడుతూ సమాజాభివృద్ధికి కీలకమైన సమాచార వ్యవస్థలో జర్నలిస్టుల బాధ్యత విలువలతో కూడినదన్నారు. పత్రికల వైరుధ్యాలు ఎలా ఉన్నా జర్నలిస్టుల సమస్యలను ఎదుర్కొంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పీఎస్‌వీప్రసాద్, జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఎంఎస్ఎన్‌రాజు, వైస్ ప్రెసిడెంట్లు మహాపాత్రో, మంచాది అప్పారావు, ఆరిపాక రాము, కోశాధికారి కుసుమంచి శ్రీనివాసరావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రయాగ పైడిరాజు, ఎ.నరసింహులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి గణేష్ పట్నాయక్, చిన్న పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేజేశర్మ, సముద్రాల నాగరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.విజయభాస్కర్, సీనియర్ జర్నలిస్టులు జీవీప్రసాద్, ఈ.సురేష్‌కుమార్, రాధాకృష్ణ, వీఎంలక్ష్మణరావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


నేడు ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేకాధికారి సమీక్ష

విజయనగరం గంటస్తంభం: నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ ప్రగతిపై జిల్లా ప్రత్యేకాధికారి, గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి బి.ఎం.దివాన్ మైదీన్ శుక్రవారం సమీక్షించనున్నారని గృహ నిర్మాణ సంస్థ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వి.శ్రీనివాస్ తెలిపారు. కలెక్టర్ ఎస్.నాగలక్ష్మితో ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే సమీక్ష సమావేశానికి గృహనిర్మాణ సంస్థ క్షేత్రస్థాయి అధికారులు, ఎంపీడీలు, ఇంజినీరింగ్ సహాయకులు, వార్డు పరిపాలన సహాయకులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా ప్రారంభించనున్న జగనన్న కాలనీల్లో విద్యుత్, తాగునీరు, రోడ్లు తదితర సౌకర్యాల కల్పన తదితర అంశాలపై సమీక్ష అనంతరం ఆ కాలనీలను సందర్శిస్తారని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పార్వతీపురంటౌన్: పులి సంచరిస్తున్న ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా అటవీశాఖ అధికారి జీఏపీ ప్రసూన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పులి కదలికలు ఉదయం, సాయత్రం, చీకటి పడిన తరువాత, రాత్రివేళల్లో ఎక్కువ చురుగ్గా ఉంటాయన్నారు. రంగురంగుల దుస్తులు ధరించకుండా లైట్‌కలర్ దుస్తులు ధరించాలని, చీకటి వేళల్లో ఆరు బయట బహిర్భూమికి వెళ్లకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. పులి పాదముద్రలు గమనించిన వెంటనే ఉత్సుకతతో వెళ్లకుండా తక్షణమే సురక్షితమైన ప్రదేశానికి చేరుకోవాలని పేర్కొన్నారు. పులి సాధారణంగా మట్టి రోడ్డులో సంచరిస్తుందని, పొలానికి వెళ్లే రైతులు, పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. ఒకవేళ పులికి దగ్గర పడితే అకస్మాత్తుగా పరిగెత్తకుండా నిదానంగా, నిశ్శబ్దంగా ఆప్రాంతం నుంచి వెళ్లిపోవాలని, పులి కన్పించినపుడు దాని కళ్లల్లో కళ్లుపెట్టి చూడరాదన్నారు. పెంపుడు జంతువులు ఆవులు, గేదెలు, ఎద్దులు, మేకలపై దాడి చేస్తే వెంటనే అటవీశాఖాధికారులకు సమాచారం అందించాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి




విజయనగరం క్రైమ్: శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. మృతుడి శరీరంపై ఉన్న షర్ట్ కాలర్ మార్క్ ఆధారంగా విజయనగరం వాసిగా రైల్వే పోలీసులు తెలిపినట్లు విజయనగరం జీఆర్‌పీ ఎస్సై రవివర్మ గురువారం తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే వెంటనే తమను సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు..

పట్టణంలో బైక్‌పై వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గురువారం రాత్రి ఓ యువకుడు మృతిచెందాడు. దీనికి సంబంధించి రూరల్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక వైజంక్షన్ నుంచి అరుణ జూట్ మిల్లు వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు, పక్కనుంచి వెళ్తున్న బైక్‌ను ఢీకొనడంతో డకిని వీధికి చెందిన నడిపేన నవీన్ కుమార్ (30) తీవ్రగాయాలపాలయ్యాడు. దీంతో బస్సు డ్రైవర్ వెంటనే కేంద్రాస్పత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై గణేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గజరాజుల అలజడి


మాదలింగి మామిడితోటలో తిష్టవేసిన గజరాజుల గుంపు


ధ్వంసమైన రైస్‌మిల్లు

కొమరాడ: మండల ప్రజలను గజరాజుల బాధ వీడడం లేదు. మూడు రోజులుగా మాదలింగి గ్రామ సమీపంలోని మామిడితోటలో తిష్ట వేసిన ఏడు ఏనుగులు బుధవారం రాత్రి గ్రామానికి చెందిన త్రినాథ్ నాయుడు ధాన్యం మిల్లుపై దాడి చేసి యంత్రాలు ధ్వసం చేశాయిని గ్రామ రైతులు చెబుతున్నారు.

సుమారు రూ.10లక్షలు ఆస్తి నష్టం వాటిల్లిందని వాపోతున్నారు. ఉభాలు వేసిన పొలాలను తొక్కి పాడుచేస్తున్నాయని ఆవేదన వెళ్లగక్కుతున్నారు. ఎప్పుడు ఎలా దాడి చేస్తాయోనని భయందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు కూడా సాయంత్రం ఐదు గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉంటున్నారని తరువాత ఫోన్ చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు దృష్టి సారించి గజరాజులను ఈ ప్రాంతం నుంచి తరలించాలని కోరుతున్నారు.

రైళ్లలో నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ


జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: రైళ్లలో నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. ఈ మేరకు జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ అధికారులతో జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఆమె సమావేశం నిర్వహించారు. ఇటీవల కాలంలో రైళ్లలో ప్రయాణిస్తూ , ఫుట్‌బోర్డుల వద్ద కూర్చొని, లేదా నిల్చు న్న ప్రయాణికులు సెల్‌ఫోన్లు చూస్తుండగా కొంతమంది ఆకతాయిలు వారి చేతుల్లోని మొబైల్ ఫోన్‌లను కర్రతో కొట్టి కిందపడగొట్టి, కాజేస్తున్నారని, ఆదేవిధంగా ఔటర్లలో ఆగిన రైళ్లలోకి ఆకతాయిలు ప్రవేశించి, భోగీలో చార్జింగ్ పెట్టిన సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లను కాజేస్తున్నట్లుగా పోలీసుల దృష్టికి వచ్చిందన్నారు. జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్, జిల్లా పోలీసులతో ఏర్పడిన ఈ ప్రత్యేక బృందాలు ఈ తరహా నేరాలను నియంత్రించేందుకు ప్రత్యేకంగా దృష్టిపెడతాయని చెప్పారు. సమావేశంలో ఎస్పీ సీఐ కేకేవీ విజయనాథ్, జీఆర్‌పీ ఎస్సై రవివర్మ, ఆర్‌పీఎఫ్ ఎస్సై బి.శ్రీధర్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి రూ.లక్ష ఆర్థిక సాయం


రెడ్డి మౌనికకు చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: టెన్నికాయిట్ క్రీడలో రాణిస్తూ అంతర్జాతీయ పోటీలకు వెళ్తున్న క్రీడాకారిణి రెడ్డి మౌనికకు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు రూ.లక్ష ఆర్థికసాయం చేశారు. ఈ మేరకు గురువారం చీపురుపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.లక్ష చెక్కును మౌనికతో పాటు ఆమె తల్లిదండ్రులకు అందజేశారు. అండర్-20 విభాగంలో అంతర్జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు రెడ్డిమౌనిక సౌత్ ఆఫ్రికా వెళ్లనుంది. ఆర్థికంగా స్తోమత లేని మౌనిక వైఎస్సార్‌సీపీ మండల నాయకుల ద్వారా జిల్లా పరిషత్ చైర్మన్‌ను ఆశ్రయించి తన పరిస్థితి వివరించింది. దీనికి స్పందించిన ఆయన జిల్లా పరిషత్ నిధుల నుంచి విమాన చార్జీల నిమిత్తం లక్ష రూపాయల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు మీసాల విజయలక్ష్మి, వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీలు వాకాడ శ్రీనివాసరావు, వలిరెడ్డి శిరీష, శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపునకు తొలి ప్రాధాన్యం



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ జీవీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్

● జేఎన్‌టీయూ జీవీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్

విజయనగరం అర్బన్: కళాశాల చదువుల ప్రారంభం నుంచి చదువుతోపాటు నైపుణ్యం మెరుగుపరచుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వాలని జేఎన్‌టీయూ జీవీ ప్రిన్సపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ అన్నారు. స్థానిక మహారాజా అటానమస్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆరురోజుల పాటు నిర్వహించనున్న 'స్టూడెంట్ ఇంట్రడక్షన్ ప్రోగ్రాం' ప్రారంభోత్సవ కార్యక్రమానికి గురువారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతనంగా కళాశాలలో చేరినప్పుడు ఆ కళాశాలలో చదువుకు సంబంధించిన పరిసరాలను తెలుసుకోవాలని సూచించారు. గ్రంథాలయాలు, ప్రయోగశాలలు వంటి వైజ్ఞానిక పరిజ్ఞానాన్ని పెంచుకుంటూ ప్రత్యేక కోర్సులను ఆన్‌లైన్‌లో నేర్చుకుని నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సాంబశివరావు మాట్లాడుతూ కళాశాలలోని డిజిటల్ లైబ్రరీ సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు. వ్యక్తిగత భావోద్వేగాలతో పరిసరాలను ఏ విధంగా వినియోగించుకోవాలో తెలియజేశారు. కన్వీనర్‌గా పి.సత్యనారాయణ, కో ఆర్డినేటర్‌గా డాక్టర్ వీ.లక్ష్మీనారాయణ వ్యవహరించారు. కార్యక్రమంలో 250 మంది నూతన విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్కానింగ్ వివరాల నమోదు తప్పనిసరి

విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులందరూ గర్భిణులకు నిర్వహించిన స్కానింగ్ సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ఫారం-ఎఫ్‌లో పొందుపరిచి, పీసీపీఎన్‌డీటీ వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఐ హాస్పిటల్, ఆర్థోపెడిక్, చిల్డ్రన్స్‌కు స్కానింగ్ చేసే వారు కూడా వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.